## క్లుప్తంగా

### చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ బాలరాజు

ఆమదాలవలస: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో నేతాజీ యూత్ సహకారంతో కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆమదాలవలస ఎస్ఐ సనపల బాలరాజు సోమవారం ప్రారంభించారు. పలువురు బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. గత ఐదేళ్లుగా ప్రతీ వేసవిలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ చిగురుపల్లి చిన్ను తెలిపారు. కిల్లి సతీష్, సి.హెచ్.కృష్ణ మదన్, తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న పురోహితులు

సారవకోట: మండలంలోని గుమ్మపాడు పంచాయతీ అక్కివలస గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. రామాలయం వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేశారు. పురోహితులు రామానుజాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

పోలాకి: అయ్యప్పస్వామి జన్మదిన సందర్భంగా నాలుగు రోజులుగా పోలాకిలోని ఆయ్యప్ప ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు సోమవారంతో ముగిశాయి. ఆఖరి రోజున స్వామివారి ప్రత్యేక దర్శనాలు, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారిని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డోల జగన్మోహన్‌రావు, తదితరులు దర్శించుకున్నారు.

### పరామర్శ..



లక్ష్మీనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: మండలంలోని కొర్లకోట గ్రామానికి చెందిన తమ్మినేని లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మృతుని భార్య సత్యవతి, కుమారుడు డాక్టర్ రవిని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం పరామర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### శీతల పానీయాల పంపిణీ



శీతల పానీయాలు పంపిణీ చేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్, తదితరులు

నరసన్నపేట: మండలంలోని జమ్ము గ్రామంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న వేతనదారులకు ఎండ తీవ్రత నుంచి ఉపసమనం కల్పించేందుకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆధ్వర్యంలో శీతల పానీయాలు సోమవారం పంపిణీ చేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ నియోజకవర్గ చైర్మన్ కె.చిన్నవాడు ఆధ్వర్యంలో నాయుడోల బంద, చిట్టోడుకర్ర చెరువుల్లో పనిచేస్తున్న వేతనదారులు 500 మందికి ఫ్రూటీలు (శీతల పానీయాలు) అందజేశారు. ఈ సందర్భంగా చిన్నవాడు మాట్లాడుతూ.. మానవ హక్కులకు భంగం కలిగితే బాధితుల తరఫున ఎన్‌హెచ్‌ఆర్‌సీ అండగా ఉంటుందన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు మొయ్యి జగన్నాథం, తలసముద్రం రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్యకు పరిష్కారం

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో రోడ్ నంబర్ 10, 16 వీధుల్లో పాడైన బోర్లను సోమవారం బాగుచేసి ప్రజలకు తాగునీరు అందించారు. సర్పంచ్ పెదకోట సాదుబాబు ఆధ్వర్యంలో బోర్లను బాగు చేశారు. రోడ్ నంబర్-1 వీధిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున నీటి ఎద్దడి తలెత్తకుండా బోర్లు పాడైన వెంటనే బాగు చేశామన్నారు.



నరసన్నపేట: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: మెట్టూరు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎల్.ఎన్.పేట: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలను వేస్తున్న జెడ్పీటీసీ త్రినాథులు, తదితరులు



మెళియాపుట్టి: హీరాపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

# అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు



ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, నాయకులు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ కులవివక్ష నిర్మూలనకు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆర్థిక అసమానతలు తొలగించి, సామాజిక సమానత్వానికి అహర్నిశలు పాటుపడ్డారని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: కోర్టు కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర తూర్పుకాపు కుల అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్



కొత్తూరు: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ సవర సావిత్రి, జెడ్పీటీసీ కామక భాగ్యవతి



హిరమండలం: అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న జైభీమ్ యువజన సేవా సంఘం నాయకులు



ఎల్.ఎన్.పేట: ఇందిరానగర్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలను వేస్తున్న ఎం.కె.మిత్రో, దళిత సంఘ నాయకులు



నరసన్నపేట: లక్ష్మీ టాకీస్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



పాతపట్నం: కోర్టు కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు



ఆమదాలవలస: బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



పాతపట్నం: చంగుడిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రుంకు అప్పారావు



సరుబుజ్జిలి: సరుబుజ్జిలి జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్ఐ హైమావతి



కొత్తూరు: నివగాంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రామరాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రామరాజు, తదితరులు



ఆమదాలవలస: ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



సారవకోట: అంబేడ్కర్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, తదితరులు



పొందూరు: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నాయకులు



జలుమూరు: తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేస్తున్న తహసీల్దార్ రామారావు, సిబ్బంది

## తాగునీటి ఎద్దడిపై చర్యలు తీసుకోండి



పోలాకి: మాట్లాడుతున్న కరిమి రాజేశ్వరరావు

పోలాకి: మండల కేంద్రం పోలాకిలో వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు అధికారులను కోరారు. స్థానిక సచివాలయంలో సర్పంచ్ మజ్జి రమణమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు హాజరయ్యారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో సిబ్బంది గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కనీస మౌలికవతులు అందించాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉందన్నారు. జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయులు, తదితరులు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్‌ను నిషేధం కఠినంగా అమలు చేయాలి**

నరసన్నపేట: మేజరు పంచాయతీలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని పలువురు సభ్యులు గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈఓ ద్రాక్షాయిని ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. వార్డు సభ్యులు ఆర్.శ్రీధర్(బుజ్జి), బి.ఎల్.శర్మ, ఎంపీటీసీలు వైశ్యరాజు కేశవరాజు, నేతింటి రాజేశ్వరరావు ప్లాస్టిక్ నిషేధంపై నిలదీశారు. వీధుల్లో ఆక్రమణలపై ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకోవాలని జామి వెంకటరావు కోరారు. గ్రామ సభలకు వివిధ శాఖల అధికారులు రాకపోవడం పట్ల ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, పలువురు సభ్యులు ఆందోళన చెందారు.

### బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న అధికారులు, యువజన సంఘం సభ్యులు

హిరమండలం: మండలంలోని రెల్లివలస గ్రామంలో గల అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 5వ, 8వ తరగతి విద్యార్థులకు అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 138 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతీ తరగతి నుంచి ఉత్తమ ప్రతిభ చూపిన పది మంది విజేతలకు గోల్డ్ మెడల్, విద్యాసామగ్రి, బహుమతులతోపాటు నగదును స్థానిక ఎస్ఐ ఎండీ యాసిన్, ఎంఈఓ కె.రాంబాబు అందజేశారు.

## కూటమి పాలనలో మహిళలకు రక్షణలేదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి అన్నారు. సోమవారం పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులతో కలిసి ఆమె మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి భారతిపై అసభ్యకరంగా మాట్లాడిన టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై ఈ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా కొంతకాలం నుంచి వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు, మహిళా ప్రజాప్రతినిధులపై చేబ్రోలు కిరణ్, టీడీపీ కార్యకర్తలు అసభ్యకర పోస్టులు పెడుతున్నారని తెలిపారు. కిరణ్‌పైనే కాకుండా మిగిలిన వారిపై కూడా ఈ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలను కించపరిస్తే సహించబోమని హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షులు సవిరిగాన ప్రదీప్, పోలాకి జమమునిరావు, గండివలస ఆనందరావు, మీసాల రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ లోలుగు లక్ష్మణరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, నాయకులు ఎనుగుతల సూర్యం, మాధవ పుల్లాయ్, పోత్తడి మురళి, వెలమల బాలరాజు, గోకవలస రాము, సరవ రమేష్, చింతాడ త్రినాథరావు, అంపిలి బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్..



వర్షం వస్తే కొత్తకోట హైస్కూల్ ఆట స్థలం పరిస్థితి ఇలా.. (ఫైల్)

- అభివృద్ధికి దూరంగా క్రీడాస్థలాలు
- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సరుబుజ్జిలి: విద్యార్థులు తరచూ క్రీడల్లో పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వం.. క్రీడలకు కావలసిన మౌలిక వసతుల కల్పనలో చిన్నచూపు చూస్తోందని చెప్పవచ్చు. పాఠశాలల్లోని మైదానాలు అభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు మంజూరు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ.. ఆచరణలో ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదన్న విషయం స్పష్టమవుతోంది.

**క్రీడా మైదానం ఇలా ఉండాలి..**

ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలలకు 1.5 ఎకరాలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 2 ఎకరాలు, ఉన్నత పాఠశాలలకు 4 ఎకరాల ఆటస్థలం ఉండాలి. చాలావరకు పాఠశాలలకు ఆటస్థలాలే కరువయ్యాయి. ఆమదాలవలస నియోజకవర్గంలోని ఆమదాలవలస, బూర్జ, పొందూరు, సరుబుజ్జిలి మండలాల్లో 207 పాఠశాలలకు 178 పాఠశాలలకు సరైన ఆట స్థలాలు లేవు. సరుబుజ్జిలి మండలంలోని కొండవలస, పాలవలస, పెద్దమతలబుపేట, పొందూరు మండలంలోని రాపాక, దల్లిపేట, వీఆర్‌గూడెం, మజ్జిలిపేట, బూర్జ మండలంలోని కె.కె.రాజపురం, తోటవాడ, మామిడివలస, గుత్తావల్లి, ఓవిపేట, ఉప్పినివలస, పాలవలస స్కూళ్లకు ఆటస్థలాలు సక్రమంగా లేవు. కొత్తకోట ఉన్నత పాఠశాలకు క్రీడా మైదానం విశాలంగా ఉన్నప్పటికీ.. వర్షం వచ్చిందంటే మైదానం మొత్తం నీరు చేరుతుంది. రాకపోకలకు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎంపీయూపీ, ఉన్నత పాఠశాలల్లో పీఈటీలు ఉన్నప్పటికీ.. సరైన ఆట స్థలాలు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని రొట్టవలస హైస్కూల్ మైదానం

**ఆమదాలవలస నియోజకవర్గంలో పాఠశాలలు, క్రీడా మైదానాల వివరాలు..**

| మండలం | ఆమదాలవలస | బూర్జ | పొందూరు | సరుబుజ్జిలి |
|---|---|---|---|---|
| మొత్తం పాఠశాలలు | 95 | 60 | 65 | 52 |
| క్రీడా మైదానాలు లేనివి | 50 | 40 | 45 | 43 |

### మైదానాలను బాగు చేయాలి



మైదానాలు ఉన్నచోట్ల అభివృద్ధి చేయడంలేదు. క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఉన్నతస్థాయిలో రాణించలేకపోతున్నారు. అత్యధికంగా నిధులు మంజూరు చేసి క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలి. క్రీడల పట్ల ఆసక్తి సన్నగిల్లుతుంది. ఆటలు ఆడాల్సిన సమయంలో వృథాగా కాలం గడుపుతున్నాం.

– ఎ.దివాకర్, విద్యార్థి, పెద్దసవళాపురం, సరుబుజ్జిలి

### నివేదికలు పంపిస్తాం



క్రీడా మైదానాల అభివృద్ధి కోసం అన్ని రకాల చర్యలూ తీసుకోవడం జరుగుతుంది. ఉపాధి హామీ ద్వారా ఆట స్థలాలను అభివృద్ధి చేసేందుకు పరిశీలన చేస్తాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే తదుపరి చర్యలు తీసుకొంటాం.

– డి.బాలరాజు, ఎంఈఓ, సరుబుజ్జిలి

## రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్





ర్యాలీ నిర్వహిస్తున్న జైభీమ్ యువజన సంఘ సభ్యులు

హిరమండలం: రెల్లి కులస్తులకు రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ హిరమండలం మండల కేంద్రంలో జై భీమ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో న్యాయ పోరాట సమితి సభ్యులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీధర్, శంకర్ మాట్లాడుతూ జిల్లాను యూనిట్‌గా చేసి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలన్నారు. రెల్లి కులస్తులకు వర్గీకరణలో రిజర్వేషన్ శాతాన్ని పెంచాలన్నారు. కుల గణన చేపట్టిన తరువాతే వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో రెల్లి కులస్తులకు అన్యాయం చేయవద్దన్నారు. భావి తరాలకు ఈ ఫలాలు అందించాలంటే వర్గీకరణలో తమకు న్యాయం జరగాలన్నారు. అంబేడ్కర్ జయంతిని సందర్భంగా పాతబస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సంఘ సభ్యులు రమేష్, రవిరాజా, జగదీష్, విజయ్, సాయి కిరణ్ పాల్గొన్నారు.